బతుకమ్మ వేడుకల ఏర్పాట్లు షురూ!

- పెద్ద బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు
- ఇప్పటికే నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- పనులు ప్రారంభించిన అధికారులు



బతుకమ్మల నిమజ్జనాలకు రంగధాముని చెరువును జేసీబీతో శుభ్రం చేస్తున్న దృశ్యం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జంట సర్కిళ్లలో బతుకమ్మ వేడుకలకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. కూకట్‌పల్లిలో అమావస్యకు ముందు రోజే బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. అందులో భాగంగా కూకట్‌పల్లి హనుమాన్‌ దేవాలయం ప్రాంగణం వద్ద బతుకమ్మ వేదికను అందంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు బతుకమ్మ వేడుక ఉత్సవ కమిటీ సభ్యులు అక్కడ మరమ్మతు పనులను చేపట్టనున్నారు. అదే విధంగా బతుకమ్మలను తమ ఆటపాటలతో ఆడిన తర్వాత నిమజ్జనం చేసేందుకు కూకట్‌పల్లి రంగధాముని చెరువు వద్ద, బతుకమ్మ ఘాట్‌ వద్ద చెత్తా చెదారాలను తొలగిస్తున్నారు. మహిళలకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఐడీఎల్‌ చెరువు వద్ద ఒక క్రేన్‌ను కూడా ఏర్పాటు చేసి పెద్ద బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే అధికారులు డివిజన్‌ వారీగా బతుకమ్మ వేదికలను గుర్తించి ఆయా డివిజన్‌లకు బడ్జెట్‌ కేటాయించడంతో పాటు బతుకమ్మలను స్థానికంగా నిమజ్జనం చేసేందుకు కృత్రిమ పాండ్లను ఏర్పాటు చేస్తున్నారు.జంట సర్కిళ్లలో సుమారు కోటి రూపాయలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

నిధుల కేటాయింపు వివరాలు

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో బోయినపల్లి వార్డు నెంబర్‌ 119 బోయిన్‌ చెరువు వద్ద బేబి పాండ్‌కు రూ.4.60 లక్షలు, బాలానగర్‌ వార్డు నెంబర్‌ 120కు రూ.2.80 లక్షలు, కూకట్‌పల్లి వార్డు నెంబర్‌12కు రూ.3.60 లక్షలు, వివేకానందనగర్‌ వార్డు నెంబర్‌ 122కు రూ.3 లక్షలు, శంషీగూడలో తాత్కాలికంగా అంబీర్‌ చెరువుకు రూ.8.50 లక్షలు, ప్రగతినగర్‌ బేబి పాండ్‌, హైదర్‌నగర్‌ డివిజన్‌ రిపేర్స్‌, ప్రవేశ ద్వారానికి, బతుకమ్మ వేడుకలకు రూ.8.50 లక్షలు, ఆల్విన్‌కాలనీకి రూ. 3.10 లక్షలు, హైదర్‌నగర్‌లోని అంబీర్‌ చెరువు వద్ద రూ.3.60 లక్షలు. మొత్తం రూ.37.70 లక్షలు, కేపీహెచ్‌బీ కాలనీకి రూ.3.90 లక్షలు, బేబి పాండ్‌ శుభ్రత, ఇతర ఖర్చులకు రూ.19 లక్షలు కైత్లాపూర్‌లోని ముళ్ల కత్వ చెరువు, బాలానగర్‌ నగర్‌కు రంగధాముని చెరువు వద్ద క్రేన్‌ల ఏర్పాటు, పరిశుభ్రతం, లైటింగ్‌ తదితర ఖర్చులకు రూ.6.80 లక్షలు, మూసాపేటకు రూ.4.90 లక్షలు, ఇతర ఏర్పాట్లకు రూ.1.20 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది.

- ప్రతి సంవత్సరం కూకట్‌పల్లిలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. రాష్ట్రంలోనే అమావస్యకు ఒక్కరోజు ముందుగా 20వ తేదీ నుంచి సాయంత్రం 5 గంటల నుంచి కూకట్‌పల్లి గ్రామంలో హనుమాన్‌ దేవాలయం వద్ద భారీగా బతుకమ్మ ఉత్సవాలు జరుగుతాయి. ఇక్కడ బతుకమ్మ ఆడిన తరువాత రోడ్డు అవతలి వైపున పీఎస్‌ఎం స్కూల్‌లో బతుకమ్మ ఆడి అనంతరం రంగధాముని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. 20 నుంచి తొమ్మిది రోజులు పాటు ఘనంగా వేడుకలు జరుపుకుని 29న సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి.

29న సద్దుల బతుకమ్మ

29న సద్దుల బతుకమ్మ సంబరాలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. రంగధాముని చెరువు కట్టపై ప్రత్యేక ఏర్పాట్ల నడుమ వేలాది మంది హాజరై బతుకమ్మలను ఘనంగా ఆటపాటలతో పూజించి నిమజ్జనం చేస్తారు. అత్యంత వైభవోపేతంగా ఆకట్టుకునేలా అలంకరించిన బతుకమ్మలకు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులను కూడా ఎమ్మెల్యే అందజేస్తారు. బతుకమ్మ వేడుకలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.




కూకట్‌పల్లిలోని పలు ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకకు సిద్ధం చేస్తున్న సిబ్బంది

బతుకమ్మ సంబరాల సమావేశం

బాలానగర్‌: ఫతేనగర్‌ డివిజన్‌ పరిధిలో ఈ నెల 21న ఎంగిలిపూల బతుకమ్మను విజయవంతం చేయాలని ఫతేనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ పండాల సతీష్‌ గౌడ్‌ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్‌ పార్కులో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో పార్టీ డివిజన్‌ అధ్యక్షులు భిక్షపతి, నాయకురాలు ఉమావతి గౌడ్‌, జ్యోతిగౌడ్‌, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్‌



చెక్కు అందజేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్‌

కూకట్‌పల్లి: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్‌ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలువురుకి పార్టీ కార్యాలయంలో రూ.1.47 లక్షల విలువ చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలు, మధ్య తరగతి వారు కార్పొరేట్‌ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకొని బిల్లులు చెల్లించలేని వారు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌ రెడ్డి

బాలానగర్‌: బాలానగర్‌ డివిజన్‌ పరిధిలోని ద్వారకామయి జేపీఆర్‌ కాలనీలో గురువారం వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే అన్ని మౌలిక వసతులు కల్పించామని, పెండింగ్‌లో ఉన్న పనుల్లో ప్రాధాన్యత ఉన్న పనులను ముందస్తుగా చేపట్టి పూర్తి చేస్తున్నామన్నారు.

వేంకటేశ్వర నగర్‌లో స్వచ్ఛ భారత్‌



ఆల్విన్‌కాలనీ: సేవాపక్షంలో భాగంగా గురువారం బీజేపీ వివేకానందనగర్‌ డివిజన్‌ అధ్యక్షులు డాక్టర్‌ ఎస్‌. వంశీరెడ్డి ఆధ్వర్యంలో వేంకటేశ్వర నగర్‌లో స్వచ్ఛ భారత్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో శానిటేషన్‌ సిబ్బంది, కన్వీనర్‌ రేపన్‌ రాజు, కో కన్వీనర్‌లు వేణు, మనోజ్‌, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి

కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్‌: కాలనీల్లో వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని 2వ డివిజన్‌ సింహపురి కాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా అవరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ చిట్ల దివాకర్‌, ఎన్‌ఎంసీ జనరల్‌ సెక్రటరీ కొలన్‌ జీవన్‌రెడ్డి, వీరబాబు, ఆదిరెడ్డి, నారాయణరెడ్డి, వాసు, ఆంజనేయవర్మ, శ్రీనివాస్‌, రఫాత్‌, ప్రశాంత్‌రెడ్డి, సందీప్‌, మహేష్‌, కాలనీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, బాల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు, రామ్‌కుమార్‌, సత్యనారాయణరావు, శ్రీనివాస్‌, అఖిల్‌ తదితరులు పాల్గొన్నారు.



యువమోర్చా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి, కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: ప్రధాని జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద యువమోర్చా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి హాజరై మాట్లాడారు. సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వాములవ్వాలన్నారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై రక్తదానం దాతలను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాష్‌రావు, అర్శనపల్లి సూర్యారావు, అసెంబ్లీ కన్వీనర్‌ శ్రీకర్‌రావు, డివిజన్‌ అధ్యక్షులు అనంత నాగరాజు, వంశీరెడ్డి, యువమోర్చా నాయకులు హరిప్రసాద్‌, ఈ. సాయిప్రసాద్‌, తిరుపతి రెడ్డి, క్రాంతి కుమార్‌, దారా సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ నిందితుడి రిమాండ్‌

మోతీనగర్‌: అల్లాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గుడిలో దొంగతనం చేసిన పాత నేరస్తుడు గంట వీరభద్రరావు (మానేశ్వరరావు) అల్లాపూర్‌ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అల్లాపూర్‌ సీఐ సామల వెంకట రెడ్డి వివరాల ప్రకారం.. వివేకానందనగర్‌లో రాజమండ్రికి చెందిన గంట వీరభద్రరావు బంధువుల వద్ద ఉంటున్నాడు. జల్సాల కోసం దొంగతనాలు చేయడం అలవాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో తులసినగర్‌లో తాళం వేసిన గుడుల కోసం వెతుకుతుండగా పోచమ్మ ఆలయానికి తాళం వేసి కనిపించింది. వెంటనే వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్డుతో గుడి తాళం పగులగొట్టి వెండి కిరీటం, శఠగోపం, హుండీలోని కొంత నగదును అపహరించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగి రాజమండ్రిలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. వెండి కిరీటం, 2 శఠగోపములు, 50 వేల నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. రాజమండ్రి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బైక్‌ దొంగతనం చేసి జైలుకి వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు




మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ అజీజ్‌నగర్‌ సర్వే నెంబర్‌ 18లో గురువారం కురిసిన వర్షానికి వర్షపు నీరు రోడ్డుపై నిలిచి చెరువును తలపించాయి. ఎప్పుడు వర్షం కురిసినా ఈ ప్రాంతంలో వర్షం నీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. బోరబండ సైడ్‌ ట్రీ నుంచి వచ్చే మురుగునీరుతో పాటు వర్షం నీరు ప్రవహించడంతో రోడ్లు చెరువులను తలపించాయి. వర్షం నీటిని తొలగిపోయేలా శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నాటి నిజాం.. నేటి మోదీ పాలన ఒక్కటే



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

నిజాంపేట్‌: నాటి నిజాం పాలన, నేటి మోదీ సర్కార్‌ పాలనలో తేడా ఏమీ లేదని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్‌. వీరయ్య అన్నారు. గురువారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. పరేడ్‌గ్రౌండ్‌ సభలో కేంద్రమంత్రి రాజనాథ్‌ సింగ్‌ అన్ని అబద్ధాలే మాట్లాడారన్నారు. విమోచన దినం అనేది పెద్ద అబద్ధం అని, ట్రంప్‌ పెత్తనం చేస్తుంటే మోదీ తల వంచుకుంటున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రులకు దేశ భక్తులుగా చెప్పుకునే అర్హత లేదని, అది దేశ ద్రోహుల గ్యాంగ్‌ అని అన్నారు. హైదరాబాద్‌ పోరాటంలో బీజేపీ ఆనవాళ్లులేవని, నాటి రజాకార్లకు, నేటి ఆర్‌ఎస్‌ఎస్‌ కార్యకర్తలకు పెద్ద తేడా లేదన్నారు.

హెచ్‌సీయూలో నేడు విద్యార్థి సంఘం ఎన్నికలు



రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం ఎన్నికల ప్రక్రియ తుది దశకు చేరుతోంది. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెచ్‌సీయూ క్యాంపస్‌లో పోలింగ్‌ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు తమతమ విభాగాల్లో ఓటు హక్కును వినియోగించుకోవ డానికి తగిన ఏర్పాట్లు చేశారు. పోలింగ్‌ అనంతరం సాయంత్రం బ్యాలెట్‌ బాక్సులను ఓట్ల లెక్కింపు కేంద్రానికి తరలిస్తారు. అనంతరం రాత్రి అక్కడే ఉంచి శనివారం ఉదయం 9 గంటలకు ఓట్ల లెక్కింపును క్యాంపస్‌లోని డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ ఆడిటోరియంలో ప్రారంభించి ఫలితాలను అన్నింటిని పూర్తి చేశాక అధికారికంగా ప్రకటించేందుకు ఏర్పాట్లు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్‌ వైద్య సేవలు

ఎంపీ ఈటల రాజేందర్‌



కుత్బుల్లాపూర్‌: సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్‌ వైద్య సేవలు అందుతాయని ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. కొంపల్లికి చెందిన ప్రేమావతికి బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్‌ పాతూరి శివాజీ రాజు రూ.15వేల ఆర్థిక సహాయం అందజేశారు. అంతే కాకుండా ఎంపీ ద్వారా మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్‌చెక్కును గురువారం అందజేవారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ. ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మానవ విలువలపై అవగాహన

దుండిగల్‌: మానవ విలువలు అనేవి దయ, నిజాయితీ, ప్రేమ, శాంతి వంటి మానవులకు సహజంగా ఉండే ప్రాథమిక నైతిక లక్షణాలని, అవి సమాజానికి, వ్యక్తికి మంచితనాన్ని పెంపొందిస్తాయని కొచ్చిఃయూనివర్సిటీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ సునీల్‌ కుమార్‌ అన్నారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌ రెడ్డి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ మేనేజ్‌మెంట్‌ కళాశాలలో ఏఐసీటీఈ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ప్రపంచ మానవ విలువలపై అవగాహన సదస్సు గురువారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. విలువలనేవి వ్యక్తి యొక్క ప్రవర్తనను, ఉద్దేశాలను నిర్దేశిస్తాయని, జీవితంలో ఏం ముఖ్యమో నిర్ణయించడానికి సహాయపడతాయని అన్నారు.

ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరించాలి



ట్రాఫిక్‌ సమస్య పరిష్కారానికి అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్‌ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని సమతానగర్‌ కాలనీ నుంచి ప్రగతి నగర్‌కు వెళ్లే మెయిన్‌ రోడ్‌ నిత్యం ట్రాఫిక్‌ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో ట్రాఫిక్‌, హార్టికల్చర్‌, ఎలక్ట్రికల్‌ డిపార్టుమెంట్‌లతో కలిసి హైదర్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్‌ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగ్యనగర్‌ ఎలక్ట్రికల్‌ ఏఈ దయానంద్‌, ట్రాఫిక్‌ ఏఎస్‌ఐ ప్రభాకర్‌, జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్‌ లైన్‌మెన్‌ సుధాకర్‌, హార్టికల్చర్‌ విభాగం దాసు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా తాగునీరు అందిస్తాం



పైపులైన్‌ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ సబిహా బేగం తదితరులు

కార్పొరేటర్‌ సబిహా బేగం

మోతీనగర్‌: అంతరాయం లేకుండా ప్రజలకు తాగునీరు అందిస్తామని కార్పొరేటర్‌ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని ఆర్‌.జి.నగర్‌ సి బ్లాక్‌లో రూ.10.20 లక్షల వ్యయంతో 100 ఎంఎం డయా డీఐ వాటర్‌ సప్‌లై పైపులైన్‌ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటి నెంబర్‌ 207 నుంచి 221 వరకు, 669 నుంచి 671 వరకు, 215 నుంచి 223 వరకు స్థానిక ప్రజలకు తాగునీరు నిరంతరాయంగా అందించేందుకు వాటర్‌ సప్‌లై పైపులైన్‌ పనులను ప్రారంభించామని తెలిపారు. అదే విధంగా డివిజన్‌ పరిధిలో మౌలిక వసతులు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సయ్యద్‌ రియాజ్‌, రాంబాబు, మల్లేష్‌, శ్రీనివాస్‌, తాడెల్‌ కృష్ణ, నాగరాజు, మహ్మద రఫీ, యోగి, తాతారావు, షమ తదితరులు పాల్గొన్నారు.

స్వస్త్‌ నారీ - సశక్తి పరివార్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ మహేందర్‌

మూసాపేట: మహిళల ఆరోగ్య పరిరక్షణ, శక్తీకరణ ఉద్దేశించిన 'స్వస్త నారీ–స్వశక్తి పరివార్‌ అభియాన్‌' కార్యక్రమాన్ని గురువారం మూసాపేట జనతానగర్‌ యూపీహెచ్‌సీలో ఘనంగా ప్రారంభించారు. కార్పొరేటర్‌ కొడిచెర్ల మహేందర్‌ హాజరై మాట్లాడారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు చేపడుతున్న ఈ యజ్ఞం ప్రతి ఇంటికి చేరాలని ఆయన కాంక్షించారు. ఈ శిబిరంలో డెంటల్‌, గైనకాలజీ విభాగాలకు చెందిన నిపుణులు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ డాక్టర్‌ సంధ్య, వైద్య సిబ్బంది, బీజేపీ సీనియర్‌ నాయకులు మల్లేష్‌ గౌడ్‌, ఐలయ్య, కిషోర్‌, సతీష్‌ చారి, శోభారాజన్‌, డి. శ్రీనివాస్‌, కృష్ణ యాదవ్‌, శ్రీనివాస్‌ గౌడ్‌, శ్రీకాంత్‌, వాసవి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. వ్యర్థాలను తొలగించారు



చెత్త కుప్పలను తొలగించి బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్‌..

కేపీహెచ్‌బీకాలనీ: 'పడకేసిన పారిశుద్ధ్యం' అనే శీర్షికతో సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మూసాపేట సర్కిల్‌ పరిధిలోని కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో, వివిధ ఫేజుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్‌ ఫౌడర్‌ చల్లారు. దీంతో స్థానికులు 'సాక్షి'కి, జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. హౌసింగ్‌ బోర్డు అధికారులు స్పందించి ఖాళీగా ఉన్న స్థలాలకు ఫెన్సింగ్‌ వేసి చెత్తా చెదారాలను పారవేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

ఫ్లీచ్‌ ఇండియా–ఎఫ్‌డీడీఐ మధ్య ఒప్పందం



రాయదుర్గం: ఫుట్‌వేర్‌ డిజైన్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ ఇన్‌స్టిట్యూట్‌(ఎఫ్‌డీడీఐ)–హైదరాబాద్‌ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సదస్సు, ప్రదర్శనపై ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఫ్లీచ్‌ ఇండియాతో ఎఫ్‌డీడీఐ అధికార బృందం కలిసి అవగాహన చేసుకున్నారు. అందులో భాగంగా గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలోని ఫ్లీచ్‌ ఇండియా ఫౌండేషన్‌ కార్యాలయంలో గురువారం ఒప్పందం కుదిరింది. ఒప్పంద అంగీకార పత్రాలపై ఫ్లీచ్‌ ఇండియా ఫౌండేషన్‌ చైర్‌పర్సన్‌ డాక్టర్‌ తేజస్విని యార్లగడ్డ, ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ తేజ్‌ లోహిత్‌రెడ్డి సంతకాలు చేశారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లో నవంబర్‌ 28–30 తేదీలలో నిర్వహించనున్న జాతీయ సదస్సు, ప్రదర్శనపై చర్చించి దాన్ని విజయవంతం చేసే అంశాలపై వారిద్దరు చర్చించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే

గచ్చిబౌలి: వర్షాకాలంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ సూచించారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, కొండాపూర్‌, చందానగర్‌, హఫీజ్‌పేట్‌, మియాపూర్‌ డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో ఆయన గురువారం విస్తృతంగా పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ అత్యవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావొద్దని, ప్రతి ఒక్కరూ విధిగా స్వీయ రక్షణ చర్యలు పాటించాలని ఆయన సూచించారు. పలు అపార్ట్‌మెంట్‌ సెల్లార్లలోకి వరద నీరు వచ్చి చేరిందని, అంతటా మోటార్లు పెట్టి సెల్లార్ల నీటిని తొలగిస్తున్నామన్నారు. జీహెచ్‌ఎంసీ, హైడ్రా, జలమండలి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు. కార్యక్రమంలో ఈఈ శిరీష,డీఈ ఆనంద్‌, శ్రీదేవి, ఏఈ భాస్కర్‌ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్‌లో పర్యటించిన కాంగ్రెస్‌ నేత

చందానగర్‌ : హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని రామకృష్ణనగర్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌ గౌడ్‌ గురువారం పర్యటించారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కాలనీలోని రోడ్లు, సెల్లార్‌లలోకి వరద నీరు రావడంపై హైడ్రా సిబ్బంది, స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు.